RNI NO: TGTEL/26/A0383

డైనమిక్

# జనం వాయిస్

తెలుగు దినపత్రిక

తెలంగాణ జిల్లాలు

మంగళవారం 24-03-2026



## ఆటో డ్రైవర్ నిజాయితీ

**తక్షణ చర్యతో రూ.62,000 నగదు రికవరీ**
**పోలీస్ సిబ్బంది అప్రమత్తత**

**జనం వాయిస్, మహబూబాబ్ నగర్:**
ఈ నెల 21 న గద్వాల్కు చెందిన ఉమాదేవి గద్వాల్కు వెళ్లేందుకు ఆటోలో ప్రయాణించారు. పొన్నకల్ స్టేజ్ వద్ద బస్సు ఎక్కే తొందరలో ఆటో దిగిన అనంతరం, తన వద్ద ఉన్న రూ.62,000 నగదు కలిగిన బ్యాగ్ ఆటోలోనే మర్చిపోయిన విషయం గుర్తించారు. ఘటనపై వెంటనే

- మిగతా 2 లో ...

# వివాదాల కౌశిక్ రెడ్డి

- నిత్యం ఏదో ఒక ఇష్యూతో హడావుడి.
- అనవసర విషయాల జోలికి వెళ్లి పార్టీని రచ్చకీడుస్తున్నారన్న చర్చ.
- ఆయన దూకుడు పార్టీకి ప్లస్ అవుతుందా? మైనస్ అవుతుందా? అనే దానిపై ఇంటర్నల్ డిస్కషన్.

**జనం వాయిస్, కరీంనగర్ మార్చి23:**
వివాదాలే ఆయన జోలికి వస్తున్నాయో..లేక ఆయనే ఏరి కోరి మరీ కాంటవర్సీల్లో వేలు పెడుతున్నారో తెలియదు కానీ..నిత్యం ఏదో ఒక ఇష్యూతో హడావుడి చేస్తుంటారు




హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి. కాంగ్రెస్‌లో ఉన్నప్పటి నుంచి ఆయన వ్యవహారశైలి దూకుడుగా ఉంటూనే వస్తోంది. ఆ తర్వాత బీఆర్ఎస్‌లోకి వచ్చి ఎమ్మెల్యే అయ్యాక అనవసర విషయాల జోలికి వెళ్లి పార్టీని

- మిగతా 2 లో ...

## రేషన్ కార్డులు ఉన్నవారందరికీ రూ.5 లక్షల జీవిత బీమా!



**జనం వాయిస్, హైదరాబాద్:**
తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డులు ఉన్నవారందరికీ రూ.5 లక్షల జీవిత బీమా. తెలంగాణ ప్రభుత్వం మరో నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పేరుతో రేషన్ కార్డులు ఉన్న ప్రతి కుటుంబానికీ జీవిత బీమాను అందించనుంది. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి ఈ పథకంపై బడ్జెట్ ప్రసంగంలో ప్రకటన

- మిగతా 2 లో ...

## కాంగ్రెస్ పాలనలో నిర్బంధం

ప్రజలను మోసం చేస్తూ పైశాచికంగా వ్యవహరిస్తోందని బీజేపీ ఎమ్మెల్యేలు ఆరోపణ.

4



## బంజారాహిల్స్లో ముదిరిన భూ వివాదం
# ఏపీ ఎంపీ VS సామాన్యుడు

**జనం వాయిస్, హైదరాబాద్, మార్చి 23**
హైదరాబాద్ నగరంలో భూముల ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ప్రైమ్ ఏరియాల్లో అయితే గజం లక్షల్లోనే పలుకుతోంది. అదే సమయంలో భూ వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. కబ్జాలు, ఆస్తి వివాదాలు తెరపైకి వస్తున్నాయి. తాజాగా బంజారాహిల్స్లో ఓ స్థల వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ వివాదంలో ఏపీకి చెందిన బీజేపీ ఎంపీ ఉండటం గమనార్హం.. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్తో పాటు తెలంగాణకు చెందిన పలువురు



రాజకీయ నాయకులు, మరో వర్గం వారి మధ్య ఘర్షణకు దారి తీసింది. ఇరు

- మిగతా 2 లో ...

## అధికారులు,సిబ్బంది సమయపాలన పాటించాలి.



3

**ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.**
**ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**

## బియ్యం ఎగుమతుల్లో స్కాం

హరీష్ వర్సెస్ ఉత్తమ్



## అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని
# ఖూనీ చేస్తున్నారు

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధ్వజం**

**జనం వాయిస్, హైదరాబాద్, మార్చి 23**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజాగ్రహాన్ని అణిచివేయలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హెచ్చరించారు. బీజేపీ చేపట్టిన 'చలో అసెంబ్లీ'

- మిగతా 2 లో ...



# వివాదాల కౌశిక్ రెడ్డి

- మొదటి పేజీ తరువాయి ... రచ్చకీడుస్తున్నారన్న చర్చ ఉంది. గతంలో అప్పటి గవర్నర్ తమిళసై పై చేసిన వాఖ్యలు దుమారాన్ని రేపడంతో..ఆ తర్వాత నాలుక కరుచుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగులను బూతులు తిట్టారనే అలిగేషన్‌తో పాటు, బీజేపీ నేత ఈటల రాజేందర్‌పై ఏవో కామెంట్స్ చేసి రచ్చకు దారితీశారు.ఆ మధ్య జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌తో వాగ్వాదం కేసులో అరెస్ట్ అయి..చివరకు బెయిల్‌పై రిలీజ్ అయ్యారు. అరికెపూడి గాంధీని పరుష పదజాలంతో విమర్శించడంతో పోటాపోటీ ఫిర్యాదులకు, దాడులకు దారితీసింది. లేటెస్ట్‌గా తన నియోజకవర్గంలో సమ్మక్క సారలమ్మ జాతరలో రాద్ధాంతం చేసి..రోడ్డుపై బైఠాయించి సీపీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కాంట్రవర్సీ అయ్యాయి. చివరకు ఐపీఎస్‌ల సంఘం డిమాండ్‌తో సారీ చెప్పాల్సి వచ్చింది. అప్పటి నుంచి కరీంనగర్ సీపీ గౌస్ ఆలంను టార్గెట్ చేస్తూ వస్తున్నారు కౌశిక్‌రెడ్డి. ఇదంతా ఆయన చేసిన రచ్చ, రాద్ధాంతం అయితే..ఇప్పుడు సొంత పార్టీ నేతలే కౌశిక్‌రెడ్డి తీరుపై తిరుగుబావుట ఎగురవేస్తుండటం హాట్ టాపిక్‌గా మారింది.కౌశిక్ రెడ్డి తీరును నిరసిస్తూ హుజురాబాద్ బీఆర్ఎస్ నేతలు రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. ద్వితీయ శ్రేణి నాయకులను పట్టించుకోకపోవడం ఒక ఎత్తు అయితే, అధినేత దగ్గర తమను కనీసం పరిచయం కూడా చేయరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌశిక్‌రెడ్డి దూకుడుతో డ్యామేజ్ అవుతుందని..జమ్మికుంట మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సమావేశం ఏర్పాటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. సీనియర్ లీడర్లపై కౌశిక్ వివక్ష చూపుతున్నారంటూ అసంతృప్త నేతలు గళం ఎత్తుతున్నారు.మున్సిపల్ ఎన్నికల్లో కౌశిక్ రెడ్డి తమకు అన్యాయం చేశారనేది వారి ప్రధాన ఆరోపణ. పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి పోటీ చేసిన వారికి, తనకు సాన్నిహిత్యంగా ఉండే వారికే కౌశిక్ మద్దతు తెలిపారని ఫైర్ అవుతున్నారు. హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కౌశిక్ రెడ్డి ఏకపక్ష నిర్ణయాలే కారణమని మండిపడుతోంది క్యాడర్. ఎప్పుడో ఓసారి హుజురాబాద్‌కు వచ్చి హడావిడి చేసి..ఆ తర్వాత తమను రోడ్డు మీద వదిలేసి వెళ్లిపోతారనేది కొందరు నాయకుల వాదన.వ్యక్తిగత ఎజెండాతో పొలిటిక్స్ చేస్తూ..ఏదో ఒక వివాదంలో తల దూరుస్తూ పార్టీని రచ్చకీడుస్తున్నాని కౌశిక్ వ్యతిరేకులు విమర్శిస్తున్నారు. క్యాడర్‌ను పట్టించుకోవడం లేదంటున్నారు. పొలిటికల్‌గా కౌశిక్ రెడ్డి దూకుడు పార్టీకి, ఆయనకు ఎంత మైలేజ్ తెచ్చి పెడుతుందో ఏమో గానీ..నెగిటివిటీనే ఎక్కువ అవుతుందన్న టాక్ ఉంది. బీఆర్ఎస్ ముఖ్యనేతలు కూడా కౌశిక్‌రెడ్డి తీరుపై గుసగుసలు పెట్టుకుంటున్నారట. ఆయన దూకుడు పార్టీకి ప్లస్ అవుతుందా? మైనస్ అవుతుందా? అనే దానిపై ఇంటర్నల్ డిస్కషన్ జరుగుతున్నట్లు టాక్. ఇప్పటికైనా కౌశిక్‌రెడ్డి తన తీరును మార్చుకుంటారో..ఎప్పటిలాగే దూకుడే ఎజెండాగా పెట్టుకుని వెళ్తారో చూడాలి.

# ఆటో డ్రైవర్ నిజాయితీ

- మొదటి పేజీ తరువాయి ... అడ్డకల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ ఎం.శ్రీనివాస్ వెంటనే స్పందించి, పీసీ 218 ఏ.రాహుల్ను దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. పీసీ రాహుల్ మండల పరిధిలోని సీసీ కెమెరాలను పరిశీలించి, ఆటో నంబర్ ఖా 38 ు 2272ను గుర్తించి, డ్రైవర్ చంద్రకాంత్ ఖిలగానాపూర్, వనపర్తి జిల్లా గా గుర్తించారు.. పోలీసులు విచారణకు వెళ్లగా, డ్రైవర్ చంద్రకాంత్ డబ్బులు ఎవరికివ్వాలో తెలియక తన వద్ద భద్రపరచుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన నిజాయితీగా స్పందించి, బ్యాగ్తో పాటు అందులో ఉన్న రూ.62,000 నగదును పీసీ రాహుల్ కి అప్పగించారు. ఆ తరువాత పీసీ రాహుల్ ఆ మొత్తాన్ని ఎస్ఐ శ్రీనివాస్ కి అందజేయగా, 23-03-2026న అడ్డకల్ పోలీస్ స్టేషన్లో బాధితురాలు ఉమాదేవి నగదు తిరిగి అందజేశారు.

# అధికారులు,సిబ్బంది సమయపాలన పాటించాలి.

జనం వాయిస్, పెద్దపల్లి, మార్చి 23:
సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,కార్యాలయాల్లో పనిచేసే అధికారులు,సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కార్యాలయాల్లో ప్రతి ఫైల్ పకడ్బందీగా రికార్డు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న పాత స్కానర్ ,ప్రింటర్ మొదలైన సామాగ్రి తొలగించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలను ఎక్కువ సమయం ఎదురు చూసేలా చూడవద్దని, వారి



దరఖాస్తులను మానవతా దృక్పథంతో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా కలెక్టర్ వెంట కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులు ఉన్నవారందరికీ రూ.5 లక్షల జీవిత బీమా!

- మొదటి పేజీ తరువాయి ... చేయగా..జూన్ 2 న పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ స్కీమ్ కింద రేషన్ కార్డుల్లో ఉన్న కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల జీవిత బీమా వర్తింపచేస్తారు.



సామాజిక, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా రాష్ట్ర పౌరులందరికీ పథకం వర్తించనున్నట్లు సమాచారం.

# బంజారాహిల్స్లో ముదిరిన భూ వివాదం

- మొదటి పేజీ తరువాయి ... వర్గాల వారు పోలీస్ స్టేషన్లో కేసులు పెట్టుకునే వరకు వెళ్లింది.వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 2, అన్నపూర్ణ స్టూడియో సమీపంలో ఆనంద్ ప్రభాత్ సొసైటీలో ఉన్న స్థలం విషయంలో చాలా కాలంగా వివాదం కొనసాగుతోంది. ఏపీకి చెందిన బీజేపీ ఎంపీ సీఎం రమేష్ గత మూడేళ్ల క్రితం వివాదాస్పద స్థలం చుట్టూ రేకులతో ప్రహరీ ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల క్రితం ఆ స్థలంలో నిర్మాణాలు చేసేందుకు ఆయన సిద్ధమయ్యారు. కాగా, ఆ స్థలంలో 2 వేల గజాలు తనదేనంటూ శివనారాయణ అనే వ్యక్తి తెరపైకి వచ్చాడు. తన స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని.. ఇటీవల కోర్టుకు వెళ్లి ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారు. శివనారాయణ తన మనుషులతో స్థలం వద్దకు చేరుకొని ప్రహరీ రేకులను తొలగించాడు. అక్కడ కంటెయినర్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న సీఎం రమేష్ తన అనుచరులతో కలిసి అక్కడకు చేరుకున్నారు. తాను పెట్టించిన రేకులను ఎలా తొలగిస్తారంటూ హల్చల్ చేశాడు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకానొక దశలో కొట్టుకునే వరకు వెళ్లారు. విషయం తెలుసుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను శాంతిపజేశారు. ఆ తర్వాత రెండు వర్గాలు వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. శివనారాయణ తాము వేసిన రేకులను అక్రమంగా తొలగించి స్థలం ఆక్రమణకు పాల్పడ్డారని సీఎం రమేష్ తరఫున సూపర్వైజర్ నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ప్రతిగా.. తమ స్థలంలో కంటెయినర్ పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తుండగా సీఎం రమేష్, అతని అనుచరులు, బీజేపీ నేత లంకల దీపక్రెడ్డి, కొమురయ్య, లగడపాటి రాజగోపాల్ మనుషులు వచ్చి దౌర్జన్యం చేశారని.. తమపై దాడి చేశారని శివనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. 2006లో తాను ఈ స్థలాన్ని కొనుగోలు చేసినట్లు శివనారాయణ మీడియాతో వెల్లడించారు. అప్పటి నుంచి సీఎం రమేష్ తన స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇదే విషయమై తాను కోర్టును ఆశ్రయించినట్లు వెల్లడించారు.

# మోదీ మోడల్ రాజకీయ శాస్త్రం

**ప్రధాని నరేంద్ర మోదీ అరుదైన మైలురాయిని చేరుకున్నారు. మనదేశంలో సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వాధినేతగా వ్యవహరించిన రికార్డును ప్రధాని మోదీ సొంతం చేసుకున్నారు. సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డును మోదీ ఆదివారంతో అధిగమించారు. సీఎంగా 8,930 రోజుల పాటు సేవలను అందించిన రికార్డు పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న రికార్డును మోదీ బద్దలు కొట్టారు. గుజరాత్ సీఎంగా, దేశ ప్రధానిగా ప్రభుత్వాధినేత హోదాలలో నరేంద్ర మోదీ 8,931 పనిదినాలను పూర్తి చేసుకుని అరుదైన భారత రాజకీయ వేత్తగా నిలిచారు. దీర్ఘకాలం పాటు గుజరాత్ సీఎంగా వ్యవహరించిన రికార్డు నరేంద్రమోదీ పేరిట ఉంది. సీఎంగా సేవలు అందించే అవకాశం ఆయనకు నాలుగుసార్లు లభించింది. 2001 అక్టోబరు 7 నుంచి 2002 డిసెంబరు 22 వరకు, 2002 డిసెంబరు 22 నుంచి 2007 డిసెంబరు 22 వరకు, 2007 డిసెంబరు 23 నుంచి 2012 డిసెంబరు 20 వరకు, 2012 డిసెంబరు 20 నుంచి 2014 మే 22 వరకు నాలుగు దఫాలు ఆయన సీఎంగా వ్యవహరించారు. 2014 నుంచి మోదీ వరుసగా మూడు పర్యాయాలు దేశ ప్రధానిగా ఎన్నికయ్యారు.**



## గెలుపును అలవాటుగా చేసుకున్న నాయకుడు

ప్రజాస్వామ్యంలో రాజకీయ గెలుపు సాధించడమే అంతికాదని నిరూపించిన నాయకుడు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ. అధికారాన్ని సుస్థిర పరచడం అత్యంత నైపుణ్యమని ఆయన ప్రతీసారి నిరూపిస్తూ వచ్చారు. అధికారాన్ని సంపాదించడం కంటే, దాన్ని స్థిరపరుచుకోవడంలోనే నాయకుడి అసలైన సామర్థ్యం బయటపడుతుందన్నది రాజకీయ నానుడి. ఆ విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎప్పుడు సక్సెస్ అవుతూనే.. ప్రత్యర్థులను ఆశ్చర్యానికి గురి చేస్తూ వస్తున్నారు. నరేంద్రమోదీ ప్రస్థానం ఒక నిర్మిత రాజకీయ ప్రయోగశాల. పరిస్థితులను అర్థం చేసుకోవడం, వాటిని రాజకీయంగా మల్చుకోవడంలో ఆయన్ను మించిన భారత రాజకీయ వేత్తల్లో సాటిలేరన్నది విశ్లేషకుల అభిప్రాయం. గుజరాత్‌లో అధికార బాధ్యతలు చేపట్టిన తొలి దశలోనే ఆయన తన శైలిని స్పష్టంగా ప్రకటించారు. సంక్షోభాన్ని ఎదుర్కొనే నాయకుడిగానే కాకుండా, సంక్షోభాన్ని అవకాశంగా మలిచే వ్యూహకర్తగా ముందుకొచ్చారు. పునర్నిర్మాణాన్ని పరిపాలనా చర్యగా కాకుండా, అభివృద్ధిగా మలచడం ద్వారా ఆయన ఒక కొత్త రాజకీయ వైఖరిని సృష్టించారు. ఆయన గుజరాత్‌లో సాధించి పెట్టిన అభివృద్ధి బ్రాండ్.. బీజేపీకి దేశ వ్యాప్తంగా మరెంతో కీర్తిని తెచ్చిపెట్టింది. దేశవ్యాప్తంగా "గుజరాత్ మోడల్" ప్రచారంలోకి వచ్చింది. నరేంద్రమోదీ దేశ రాజకీయాల్లోకి ప్రవేశంతోనే వైబ్రేషన్ మొదలైంది. గుజరాత్‌లో 12 ఏళ్లు సీఎంగా పనిచేసిన అనుభవం.. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చిన తీరు కలగలిసి 2014ఎన్నికల్లో బీజేపీకి పెద్ద ఆస్తిగా మారాయి. పాత రాజకీయాలతో విసిగిపోయిన ఓటరుకు కొత్త ఆశగా, వ్యవస్థపై అసంతృప్తి ఉన్న వర్గాలకు కొత్త అవకాశంగా తనను తాను ప్రతిష్టించుకోవడంలో మోదీ సక్సెస్ అయ్యారు. ఫలితంగానే 2014లో జరిగిన దేశ రాజకీయ మార్పునకు కారణమైంది. మోదీ రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే, అది ఒక నిరంతర రూపాంతర క్రమంలా కనిపిస్తుంది. ఒక దశలో భావోద్వేగాల ప్రతినిధిగా, మరొక దశలో అభివృద్ధి శిల్పిగా, ఇంకొక దశలో జాతీయ గర్వానికి ప్రతీకగా కనిపిస్తారు. ఈ రీ-బ్రాండింగ్ సామర్థ్యమే ఆయనను ఒక వ్యక్తి నుంచి ఒక రాజకీయ ప్రబల శక్తిగా మార్చిదని చెప్పాలి.

## సాహసం.. సర్దుబాటు
## -- మోదీ రాజకీయ సమీకరణం

మోదీ నిర్ణయాల స్వభావాన్ని గమనిస్తే, అవి తరచుగా సాహసోపేతంగా కనిపిస్తాయి. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ నిషేధం, అయోధ్యలో రామమందిర నిర్మాణం ఇవన్నీ భావోద్వేగాలతో ముడిపడిన, రాజకీయంగా క్లిష్టమైన అంశాలు. కానీ ఇక్కడ ఆయన ప్రత్యేకత కేవలం నిర్ణయం తీసుకోవడంలో కాదు; దాన్ని సమయోచితంగా అమలు చేయడంలో ఉంది. అదును చూసి దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటారు. ఆపరేషన్ సింధూరు, సర్జికల్ స్ట్రైక్ గొప్ప ఉదాహరణలు. అవసరమైతే వెనక్కి తగ్గే సమయోచిత సర్దుబాటు.. సందర్భాలను మోదీ ప్రదర్శించిన తీరు రాజకీయ నైపుణ్యతకు నిదర్శనం. రైతు చట్టాల ఉపసంహరణ ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఎన్నికల్లొచ్చిన్నప్పుడే జనంతో కలిసి పోవడం అనే దానికి మోదీ మోడల్ రాజకీయం విరుద్ధం. పార్టీ నిలదొక్కుకోలేని దక్షిణాదిలో కూడా ఆయన ఎన్నికల సమయంలో విస్తృతంగా ప్రచారం చేస్తూ వస్తున్నారు. ప్రయత్నం చేస్తే ఖచ్చితంగా ఫలితాలు సానుకూలంగా వస్తాయనేదానికి బీజేపీ ఈశాన్య భారతంలో సాధించిన విజయమే మంచి ఉదాహరణగా చెప్పవచ్చు. ఎన్నికలను ఒత్తిడిగా కాకుండా, అవకాశంగా మలచడం మోదీ ప్రత్యేకతగా చెప్పవచ్చు.

## కమ్యూనికేషన్.. కనెక్షన్..

మోదీ విజయానికి మూలమైన మరో స్తంభం కమ్యూనికేషన్. రాజకీయాల్లో సందేశం ఎంత ముఖ్యమో, దాన్ని ఎలా చేరవేయాలో తెలిసి ఉండటం అంతకంటే ముఖ్యం. ఈ రెండింటినీ సమన్వయం చేయడంలో ఆయన చూపిన నైపుణ్యం ప్రత్యేకంగా నిలుస్తుంది. సోషల్ మీడియాను ఆయుధంగా మలచుకోవడం, ప్రత్యక్షంగా ప్రజలతో సంభాషించడం వంటి వ్యూహాలు..అనుసంధాన వ్యవస్థలు మోదీని జనంతో ఇంటారాక్ట్ చేసేలా చేశాయి. ప్రజల్లో "మనవాడే" మన మోదీ అనే అనే భావనను కలిగించాయి.

ఈ బంధం పార్టీ మద్దతుదారులతోనే కాక.. విభిన్న అభిప్రాయాలున్న వర్గాల్లో కూడా ఆయనపై సానుకూలత ఉండటానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. యువతను ఆకర్షించడం కూడా ఈ కమ్యూనికేషన్ వ్యూహంలో భాగమే. పాత రాజకీయ ఇమేజ్‌ను పక్కనబెట్టి, డిజిటల్ యుగానికి సరిపోయే నాయకుడిగా తనను ప్రతిష్ఠించడం ద్వారా ఆయన కొత్త ఓటర్ బేస్‌ను నిర్మించుకున్నారు. మోదీ రాజకీయ శైలిని గమనిస్తే "పరిస్థితులను అనుసరించడం కాదు, పరిస్థితులను ప్రభావితం చేయడం".అనేది సుస్పష్టమవుతుంది. సుదీర్ఘకాలం అధికారంలో కొనసాగడం అనేది యాదృచ్ఛికం ఫలితాల్లో సానుకూలత వ్యవహారం కాదు. మోదీ స్టైల్‌ను గమనిస్తే పక్కా ప్రణాళిక.. అదే స్థాయిలో రాజకీయ నిర్వహణ ఉండటమని అర్థమవుతుంది. పార్టీ నిర్మాణాన్ని విస్తరించడం, కొత్త వర్గాలను చేర్చుకోవడం, సంప్రదాయ రాజకీయ పరిమితులను అధిగమించడం ఇవన్నీ ఆయన నాయకత్వంలో కనిపించే అంశాలు. ఒక్క విజయంతో సంతృప్తి చెందకుండా, విజయాన్ని అలవాటుగా మార్చుకోవడం అదే ఆయన రాజకీయ తత్వం. గెలవడం కాదు, గెలుపును పునరావృతం చేయడం ముఖ్యం అన్నది మోదీ మోడల్ పొలిటికల్ థియరీని గమనిస్తే అర్థమవుతుంది. మోదీ ప్రస్థానం ఒక సాధారణ రాజకీయ ప్రయాణం కాదు.. అది ఆధునిక భారత రాజకీయాల్లో ఒక నమూనాగా నిలిచిపోతుంది.

# అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి ... కార్యక్రమాన్ని అడ్డుకోవడం, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావుతో పాటు సీనియర్ నేతలను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ఆయన ఖండించారు. శాంతియుత నిరసనలను అడ్డుకోవడం ప్రభుత్వ అభద్రతాభావానికి నిదర్శనమని, రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన కాకుండా పోలీస్ రాజ్యం నడుస్తోందని విమర్శించారు. ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని,తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గళమెత్తుతున్న ప్రతిపక్షాల గొంతు నొక్కడం దుర్మార్గమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని పోలీసు బలగాలతో అడ్డుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావుతో పాటు పలువురు సీనియర్ నాయకులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని కిషన్ రెడ్డి ఖండించారు.



తెలంగాణలో అసలు ప్రజాస్వామ్యం ఉందా? లేక పోలీసులతో పాలన సాగిస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కూడా కాలరాయడం కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకత్వానికి పరాకాష్ట అని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే అరెస్టులు చేయడం వారి అభద్రతాభావాన్ని సూచిస్తోందని పేర్కొన్నారు.అధికారంలోకి రావడం కోసం పచ్చి అబద్ధాలతో ప్రజలను నమ్మించి, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. రైతులు, యువత, మహిళలు తమకు న్యాయం ఎప్పుడు జరుగుతుందని ప్రశ్నిస్తుంటే, సమాధానం చెప్పలేక ప్రభుత్వం ఉలిక్కిపడుతోందని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్కు ప్రజా సంక్షేమం కంటే కమిషన్ల వసూళ్లపైనే మక్కువ ఎక్కువగా ఉందని ఘాటుగా విమర్శించారు.అరెస్టులు, లాఠీచార్జీలతో బీజేపీ పోరాటాన్ని అణచివేయలేరని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలబడి నిలదీయడం తమ బాధ్యత అని, అవినీతి మరియు అసమర్థ పాలనను గద్దె దించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఇది కేవలం ఆరంభం మాత్రమే. రానున్న రోజుల్లో ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం అని ఆయన ప్రకటించారు. ప్రజలు ప్రభుత్వంపై విసిగిపోయి ఉన్నారని, త్వరలోనే ప్రజాగ్రహం ముందు కాంగ్రెస్ ప్రభుత్వం తలవంచక తప్పదని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ పాలనలో నిర్బంధం

**జనం వాయిస్, హైదరాబాద్, మార్చి 23:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ పైశాచికంగా వ్యవహరిస్తోందని బీజేపీ ఎమ్మెల్యేలు ( ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఆర్భాటంగా ప్రకటించిన 'ఆరు గ్యారెంటీలను' రెండేళ్లు గడిచినా అమలు చేయలేదని ఆయన మండిపడ్డారు. హామీల అమలు కోరుతూ బీజేపీ చేపట్టిన 'ఛలో అసెంబ్లీ' కార్యక్రమాన్ని అడ్డుకోవడంపై ఎమ్మెల్యే పాయల్ శంకర్తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న రాత్రి నుండే రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, గతంలో కేసీఆర్ పాలన కంటే దారుణమైన నిర్బంధం ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో కనిపిస్తోందని విమర్శించారు. ఇదే పద్ధతి అవలంబించిన బీఆర్ఎస్ను ప్రజలు గద్దె దించారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్కు కూడా అదే గతి పడుతుందని ఆయన హెచ్చరించారు.అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల బకాయిలను చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం ( ప్రవేశపెట్టిన బడ్జెట్కు, చేస్తున్న ఖర్చులకు అస్సలు పొంతన లేదని ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ ఆరోపించారు. ఆడబిడ్డలకు నెలకు రూ. 2500, తులం బంగారం, విద్యార్థులకు స్కూటీలు వంటి ఆకర్షణీయమైన హామీలను గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని, ఇలాంటి అరెస్టులకు బీజేపీ భయపడదని స్పష్టం చేశారు. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, హామీలు అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు.



# బియ్యం ఎగుమతుల్లో స్కాం

**జనం వాయిస్, హైదరాబాద్,మార్చి 23:** రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో బియ్యం ఎగుమతుల చుట్టూ భారీ కుంభకోణం జరిగిందంటూ ఇవాళ అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. సీబీఐ , ఈడీ ) వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తిని ప్రభుత్వానికి అడ్వైజర్గా ఎలా నియమించుకుంటారని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై తక్షణమే 'హౌజ్ కమిటీ' వేయాలని డిమాండ్ చేశారు.

**దానికి బాధ్యులు ఎవరు..?**

వేల కోట్ల బ్యాంక్ ఫ్రాడ్, బంగారం స్మగ్లింగ్ వంటి సీబీఐ, ఈడీ కేసుల్లో నిందితుడిగా ఉన్న ప్రేమ్ చంద్ గార్గ్ అనే వ్యక్తిని బియ్యం ఎగుమతులకు అడ్వైజర్గా ఎందుకు నియమించుకున్నారని హరీశ్ రావు నిలదీశారు. ఆయన ఇచ్చిన తప్పుడు సలహాల వల్లే రాష్ట్ర ఖజానాకు భారీ గండి పడిందని ఆరోపించారు. పది లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఫిలిప్పీన్స్ కు ఎగుమతి చేస్తామని, ఇది ఒక అంతర్జాతీయ విజయం అని గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వం.. తీరా చూస్తే కేవలం 22,750 టన్నుల దగ్గరే ఎందుకు ఆగిపోయిందని ప్రశ్నించారు. ఏడాది కాలంగా సుమారు 7,500 టన్నుల బియ్యం కాకినాడ పోర్టు )లోనే నిలిచిపోయి పురుగులు పడుతున్నాయని, దీనికి బాధ్యులు ఎవరని ఆయన అడిగారు. వాటాల బేరసారాలు కుదరకపోవడం వల్లే ఎగుమతులు ఆగిపోయాయని హరీశ్ రావు



ఆరోపించారు. కాంగ్రెస్ పాలన పారదర్శకంగా ఉంటే, తాము తప్పు చేయలేదని భావిస్తే.. ఈ కుంభకోణాలపై విచారణకు హౌజ్ కమిటీ వేయాలని, దీనిని తాము ఆధారాలతో సహ నిరూపిస్తామని సవాల్ విసిరారు.హరీశ్ రావు ఆరోపణలను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇవన్నీ నిరాధారమైన ఆరోపణలని కొట్టిపారేశారు. హరీశ్ రావు సిఫార్సు చేసిన వారిని అడ్వైజర్లుగా పెట్టుకోలేదనే అక్కసుతోనే సభలో ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రేమ్ చంద్ గార్గ్కు ఫిలిప్పీన్స్ బియ్యం ఎగుమతులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇది కేవలం తెలంగాణ ప్రభుత్వం, ఫిలిప్పీన్స్ ప్రభుత్వం మధ్య జరిగిన ఒప్పందమని స్పష్టం చేశారు. ఫిలిప్పీన్స్లో నెలకొన్న రాజకీయ సంక్షోభం వల్ల అక్కడ అన్ని రకాల దిగుమతులపై ఆంక్షలు విధించారని, అయితే కేవలం తెలంగాణ రైస్ ఇంపోర్ట్సకు మాత్రమే మినహాయింపు ఇచ్చారని తెలిపారు. కేవలం ఒక్క రేషన్ బియ్యం షిప్మెంట్ మాత్రమే కాకినాడలో ఆగిపోయిందని మంత్రి ఉత్తమ్ వివరణ ఇచ్చారు.

# జర్నలిస్ట్ కు సామాజిక బాధ్యత ఎంతో ఉంటుంది.







**జనం వాయిస్, కరీంనగర్:**
శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల (స్వ) కరీంనగర్ లో సోమవారం 27 వ బ్యాచ్ జర్నలిజం సర్టిఫికెట్ కోర్స్ వీడ్కోలు కార్యక్రమం, సర్టిఫికెట్స్ ప్రదానోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ పి. నితిన్ పాఠక్, టి. రాజయ్య లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ జర్నలిజం ఆదర్శంతో కూడుకున్న వృత్తి అని దానికి పరిశీలన, పరిశోధన, భాషా పరిజ్ఞానం చాలా అవసరం అన్నారు. కళాశాల తెలుగు విభాగం అధ్యక్షులు, కోర్స్ కో ఆర్డినేటర్ డా. బూర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ జర్నలిజం సర్టిఫికెట్ కోర్స్ ద్వారా విద్యార్థులకు భాష, రచనా నైపుణ్యాలను పెంపొందుతాయన్నారు. విలేఖరి రాసే ప్రతి అక్షరం సమాజాన్ని జాగృతం చేసేలా ఉండాలన్నారు. పాత్రికేయ వృత్తి పవిత్రమయిందని దాన్ని ప్రజల క్షేమం కోసమే వాడుకోవాలని సూచించారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్స్ చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో డా. ఎం. శ్రీనివాస్ రెడ్డి, తెలుగు విభాగ అధ్యాపకులు బూర్ల వేంకటేశ్వర్లు, డా. డి. ప్రకాష్, డా. ఆర్. శ్రీనివాస్, మెట్టు వేంకటేశ్వర్లు, డా. పాత అశోక్. డా. పి. చైతన్య, డా. టి. భోజన్న, పి.శంకర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# తాగునీటి వృథాను అరికట్టాలి

**జనం వాయిస్, కరీంనగర్:**
కరీంనగర్ నగరంలోని 52వ డివిజన్ పరిధిలో సవరణ్ స్ట్రీట్‌లో, ఆర్ బి కార్యాలయం ఎదురుగా ఉన్న ఫ్రూట్స్ షాప్ లేన్ వద్ద ఎల్ఎండీ ఫిల్టర్ బెడ్ నుండి కోర్ట్ ఏరియా రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన తాగునీటి పైప్‌లైన్‌లో గత ఒక వారంగా లీకేజ్ జరుగుతోంది. ఈ లీకేజ్ కారణంగా ప్రతిరోజూ భారీగా తాగునీరు వృథా అవుతుండటంతో పాటు, పరిసర ప్రాంతంలో మట్టి పేరుకుపోయి ప్రజలకు, దుకాణదారులకు మరియు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ సమస్యపై వార్డ్ నం. 52కు చెందిన అన్నెమల్ల సురేష్ ప్రజావాణి కార్యక్రమంలో Karimnagar Municipal Corporation కమిషనర్‌కి వినతి పత్రం సమర్పించారు. ప్రధాన పైప్‌లైన్‌లో ఏర్పడిన ఈ లీకేజ్‌ను తక్షణమే పరిశీలించి మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టడంతో పాటు ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని ఆయన కోరారు. ప్రజల అవసరాలకు సంబంధించిన సమస్యలపై అధికారులు తక్షణ స్పందన చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.




